


[కథానిక]

# ఒంటరిపక్షులు

= శ్రీ తెన్నేటి సూరి =

వేసవి; పూర్ణిమ—

అక్కడ బుడమేరు చాలా వెడల్పుగా వుంది. కాని, వేసవికావటంచేత, నది చిక్కిపోయి, యేటికి మధ్యగా సన్నటి పాయలోనే మాత్రం నీరు ప్రవహిస్తోంది. ఇరువైపులా ఉబ్బెత్తుగా మీటవేసిన యిసుకతిన్నెలకు మధ్యగా ప్రవహిస్తూ, భూదేవి వక్షోద్వయానికి మధ్యనుంచి స్ఫటికపుమాల వ్రేలాడుతున్నట్టుగా వుంది ఆ సెలయేరు. ఆ నీటితరగచాలులమీద పండువెన్నెల పకళించి నెమ్మదిగా కన్నుమూస్తోంది.

ఒక స్త్రీమూర్తీ, ఒక పురుషమూర్తీ ఎత్తుగా వున్న రేవటిగట్టు దిగి ఆ యిసుకతిన్నెమీదుగా నీటిఒడ్డుకు నడిచివస్తున్నారు.

"మేరీ!"

"అబ్బా! ఆ పిలుపు నాకు సిగ్గేస్తావుండది"

"అసలు నీపేరదే మేరీ! సిగ్గెందుకు? ఎంత చక్కని పేరు! ఆపేరు పలకటం చాతకాక మరియమ్మ అంటున్నారు — మొరటుతనంగా. నాకల్లా పిలవటం బాగుండదు. మేరీ అనే పిలుస్తాను."

"ఇదిగోనా అలవాటై...నలుగుర్లో వుండగా నీకా పేరు నోరుజారుద్దేమోనని."

"మంచిపనేగా!...మన వెన్నుచాటున వాళ్లేది గుసగుసలాడుకు చస్తున్నారో, అది వాళ్లముఖాన కొట్టినట్టు ఒక్కముక్కలో తెరదించి చెప్పెయ్యగలుగుతాను...దాంతో ఆ గుసగుస లణుగుతై"

"నయం...నువ్వంతవాడివి కావనా?...నన్ను రచ్చలోకి మాత్రం యీడవమాక...నీ ఫణ్ణె హాయిరి. నీపాదాలెనక కూసేపిట్టా తిరగనియ్యి — అదిసాలు; ఎవురికీ కాపకకండా...నీవల్లే, నీయెనకెనకే మసల్తా వుంటాను, పాణంబోయేదాకా."

"నువ్వు నాప్రక్కన ఇలా నిల్చుంటే... నేనెంతో యెత్తున్నాననిపిస్తోంది మేరీ! చెయ్యెత్తితే ఆకాశమందుతుందా అనిపిస్తోంది"

అడుగు వెనక్కు వేసి మేరీ అతణ్ణి ఆపాదమస్తకం తేరిపారజూచింది. 'అవును...బలే!... ఎంతెత్తుగా నిల్చున్నాడూ!' అతనిపక్కన నిల్చుంటే తనూ ఆకాశంలోకి పెరుగుతున్నట్టనిపించింది. ఏదో, చెప్పరాని ఆవేశంతో తన శరీరమంతా క్షణక్షణం విచ్చుకుని తను ఇంకాఇంకా పెద్దదిపెద్దదిగా పెరిగిపోతున్నట్టనిపించింది. ఏదో అదపుచేసుకోలేని ఉత్సాహంతో వొళ్లు తెలియకుండాపోతోంది. ప్రక్కన నడుస్తున్న మనిషి 'చక్'న ముందుకు అడుగు వేసి అతని గమనాన్ని నిరోధించింది. ఆస్త్రీ రెండు బాహువులూ అతని నడుంచుట్టూ పాముల్లా పెనవేసుకుపోయినయ్.

తన ఆశ్రయం లేందే ఆ ప్రాణి బ్రతకలేదని తోచిందతనికి. తన నీడను ఆశ్రయించుకు బ్రదకాలనుకునే ప్రాణి ఒకటి యీలోకంలో వుంది. అది చాలు అతనికి. ఆపాదమస్తకం అతనిలో ఏమో ఒక గంభీరమైన శక్తి మేల్కొన్నట్టయింది. ఈ భూగోళానంతా గప్పున భుజస్కంధంమీదికి ఎత్తుకొని ఆశ్రయమియ్యగల ఒక మహాశక్తి అతనిలో విశ్వాసాన్ని ఆక్రమిస్తూ లేచి ఒళ్లువిరుచుకుంటోంది. ఆస్త్రీమూర్తిని

భూమిమీదనుంచి తామరమొగ్గలా చరాల్న పుణికి పుచ్చుకుని హృదయానికి హత్తుకుంటున్నాడు—

* * * *

అలసిపోయిన ఆ పురుషమూర్తిని తొడమీద పడుకోబెట్టుకు లాలించుతోంది మేరీ. ఆ యిసుక తిన్నెకు మధ్యగా జలదేవతలా కూర్చునివుంది. కెంపులు తాపిన జారుజిగినీ మేరీమెళ్లో వెన్నెల్లో మెరుస్తోంది. ఆ దృశ్యాన్నంతా అతను కళ్ళతో మింగేస్తున్నాడు.

"ఈ జిగినీ నా కెందుకు తెచ్చావూ ?"

"ఏం ?"

"ఎవురన్నా సుత్తే ?"

"బోసిమెడతో ఆడదాన్ని నేను చూళ్లేను మేరీ ...అయినా చూస్తేమటుకు యేం మునుగుతుం దంటావు ?"

"నీ మొండితనం సూత్తే ... కిదంతా బయమేత్తా వుండది. నువ్వెప్పుడో కుంపబద్దలుకొట్టేసేతట్టే వుండావు...సివరి కిదంతా నాపీకమీని కేం మునుగుతదో ?"

"అనవసరంగా భయపడుతున్నావు మేరీ ! ఏం మునగుతుంది...ఏమీ మునగదు—"

"నీకేం మారాజువి ; మొగరాయుడివి"

* * * *

"ఇదుగో !—"

"..............."

"ఒకమాట సెప్పకోనా ?"

అతను ఒక చిరునవ్వు నవ్వాడు—

"చెప్పు ; సంతోషంగా వింటాను. వింటమే గాదు...నక్షత్రాలు తాపిన ఈ ఆకాశాన్నంతా చీరమడతగా మడిచి నీచేతుల్లోకి అందించమంటావా ? చెప్పు ; అందిస్తాను." అన్నట్టు అతని హృదయం అతని కుడి కంటికొసలోనుంచి గంభీరంగా శబ్దించుతోంది.

"శేత్తిరేలా...ఇంటికేడే వుండరాదూ...మద్దానవేల సేలో యీడ నాకేడ వుందువుగానీ"—

చివుక్కున ముఖం చిన్నబుచ్చుకున్నాడు—

"నిన్నూ విసిగిస్తున్నానా మేరీ ?"

నాలిక కరుచుకొంది—

"ఆహాఁ...అదిగాదు...దొరసాని ఒంట్రైతుగా ఒకిత్తే...ఎట్టా బతుకుతదీ, రాత్తిరివేల సీకట్లో ?—ఆ యమ్మని సిన్నబుచ్చటం నా కెంతో బాదేతావుండది. ఆతల్లి యెంతేడత్తావుండదో నీకోసం !...పాడుజల్మ ఆయమ్మనిగాడా సీకాకేతావుండాను....నా పాణం యెందుకు పోదూ ?" లోపల పేగులు కోసుకుపోతున్నట్టు బాధగా యేడుస్తోంది.

అతను చివాల్న లేచికూర్చున్నాడు. ఆ స్త్రీ అరచేతులు రెండూ ముఖాన్నుంచి విచ్ఛిద్రీసి తన చేతుల్లోకి పుచ్చుకున్నాడు.

"మేరీ ! యీవిషయం నీతో ఎప్పుడో చెప్పవలసింది. కాని ఆఅవకాశం కలగలేదు. ఇప్పుడు చెబుతున్నావిను. దొరసానికోసం నువ్వు విచారపడకు మేరీ ! దొరసాని నాకోసం విచారపడదు ; దొరసానికి నేనక్కర్లేను. అక్కరేకపోయినా నేనుమటుకు ఈ యెనిమిదిసంవత్సరాలనుంచీ ఆవిణ్ణి పిశాచంలా వెంటబడి వేపుకుతిన్నాను. చివరచివరకు ఆవిడకు విసుగెత్తి, నామీద చిరాకుపడటంకూడా ప్రారంభించింది. మెళ్లో పుస్తెకట్టానుగదాఅని, తప్పనిసరి కర్మక్రింద, నాతో సంసారంచెయ్యటం మొదలుపెట్టింది. నిరుత్సాహంగా, ప్రాణంలేని గుడ్డబొమ్మలా ఆ ఆడదాంతో సంసారమా ?...ఛీఛీ! అసహ్యం—(కంటగించుకున్నాడు)— ఆమరణాంతం ఆ కత్తికోతకంటే, ఒక బాకు పుచ్చుకుని చరాల్న డొక్కలో దించేసుకుని ప్రాణం వదలటంలో ఇంకా కొంత ఆనందంవుంది. ఆ యమయాతన నేను భరించలేను మేరీ ! మళ్లా ఆ నరకకూపంలోకి ప్రాణాలు బిగబట్టుకు నన్ను నేను బలవంతాన తోసేసుకోలేను. మేరీ !—పోనీ...నీకూడా విసుగ్గావుంటే నవ్వూ తప్పుకో మేరీ !...ఏం జెయ్యనూ ?" అన్నాడు జాలిగా.

ఆకాశమంత మనిషీ అట్టే దీనమూర్తిగా దించుకుపోయి, దిగులుగా కూర్చున్నాడు. మేరీకి గుండె తరుక్కుపోయింది. ఆప్యాయంగా డొక్కలోకి పొదువుకుని అనునయించుతోంది—

"ఎరక్కన్నాను...అంత జాలిబడ్తా వెందుకూ ? ...నువ్వంటే నాకు యిసికేతదా...ఎంతమాటన్నావూ ?...నాజల్మకి బంగారుకొండే దొరికిం దనుకుంటా వుండాను. గతిలేని పచ్చిగా యేడత్తావుండదాన్ని కనికారంగా ఒళ్లోకిదీసుకుని బతకమన్నావు. నిన్ను వొదులుకుంటానా ?...నిన్ను ఒదులుకోవాల్సివొత్తే నాపాణమే వదుల్తాను. అట్లా మొగం చిన్నబుచ్చుకో మాక...నీయంక జూత్తావుంటే...నాకేందో...గుబులు

గుబులుగా గొంతులో యేడుపొత్తావుండది...ఇటు సూడు...నాయంక నవ్వుతా సూడు. ఎనకటికిమల్లే నాకళ్లల్లోకి సూసి సంతోసంగా నవ్వు...నా సేదో యెరకన్నాను. యెందు కంత జాలిబడ్డావూ?" చెక్కిళ్లు బుచ్చుకు బ్రతిమిలాడుతోంది.

మేరీఒళ్లో పసిబిడ్డలా పడుకున్నాడు. ఆస్త్రీ అరచేతులు మసిలిపోతున్న తన రెండుబుగ్గలకూ హత్తుకుంటున్నాడు. వినిపించీవినిపించని గొంతుతో నెమ్మదిగా మాట్లాడుతున్నాడు.

"నాకు బుద్ధి తెలిసేటప్పటికే మాఅమ్మ చచ్చిపోయింది మేరీ! అప్పటినుంచీ నా జీవితమంతా యీ మెట్టచేలోనూ, యీ తోటలోనూ గడిపాను. ఈ బుజమేటిగాలికి ఆకులు కదిలి సన్నగా ధ్వనిచేస్తుంటే, ఆచెట్లు సంతోషంగా నన్ను పలకరించుతున్నట్టుగానే వుంటుంది. తోటలో పాకలో కట్టివేసివున్న ఆ యెడ్లూ, ఆవులూ, లేగలూ—అన్నీ ఆనందంగా కళ్లు ఇంతింతగా విచ్చులుకుని, నవ్వుతూ నావంక జూసి, మోరలు పైకెత్తి 'అంభా' అంటూ నన్ను ప్రేమగా పిలుస్తై. ఈయేటి ముగిలోకి అడుగు బెడితే, ఈ సెలయేరుకూడా, హృదయమంతా విచ్చులుకొని, కిలకిలా నవ్వుతూ నన్ను తనవాణ్ణిగా పలకరించుకుంటుంది. అంతదూరమెందుకు— బుగ్గను ముంజేయ్యాని, ఇలా నాముందు మౌనమూర్తిగా కూర్చున్నావు కాని నీ హృదయం నన్ను పలకరించుతూనేవుంది—"

మేరీ రొమ్ముమీద చెయ్యివేసి చూసుకొంది. ఆశ్చర్యం...అవును...నిజమే...ఇదేమిటి ?... పలకరించుతున్నట్టుగానే వుంది. అవునన్నట్టు ఆశ్చర్యంగా అతనివంక తెల్లపోయి చూసింది.

"కాని,...మీ దొరసానికిమాత్రం నన్ను పలకరించటం చేతగాదు మేరీ! ఆవిడ మాట్లాడుతున్నా, నా కావిడ మాట్లాడుతున్నట్టుగావుండదు. ఆమాటల వెనక హృదయముండదు. గ్రామఫోను రికార్డుకు మల్లే కొంచెంసేపు వింటే ఇట్టే విసిగెత్తిపోతుంది."

"మనసిచ్చి ఆతల్లి నీతో యెందుకు మాట్లాడుకోదూ?"

"చేతగాక— ఆవిడ ధోరణి వింటుంటే, ఆవిడకేమన్నా కొంచెం పిచ్చేమోననికూడా అప్పుడప్పుడు అనుమానమేస్తుంది— ఆవిడపుట్టింటివాళ్ళు చాలా గొప్ప వాళ్లట. తన అన్నగారు తాసిల్దారుట; వదిన హార్మోనియం వాయిస్తుందిట; వాళ్లు అద్దెకున్న మేడ చాలా అందంగావుంటుందిట; వాళ్ల పినతండ్రికూతురూ అల్లుడూ మద్రాసులో బీచిమీద షికారుజేస్తారట; వాళ్ల మేనమామ చాలా దర్జాగలవాడట; వాళ్లంతా రోజుకు డజనుసార్లు కాఫీతాగుతారుట; వాళ్లంతా చాలా గొప్పవాళ్లుట; గొప్పవంశంట; వాళ్లల్లో పుట్టిందిగనుక తనూ గొప్పదేట—

"ఈ పిచ్చవాగుడంతా, నోటికి విసుగూ విరామమూ లేకుండా ప్రొద్దస్తమానమూ తను వాక్కుంటూ కూర్చుంటుంది; చుట్టూవున్నవాళ్లందర్నీ వాగమంటుంది. ఎప్పుడన్నా, కాస్త విసిగెత్తి, నేనా వాగుడు వాగలేక కొంచెంసేపు మాన్తే, ఆవిడకు ఎక్కడలేని దురాగ్రహమూ వచ్చేస్తుంది. మూతిబిగించుకుని ఇక ఆయిదారురోజులు, పిలిచినా పలక్కుండా, సత్యభామలా, అలిగికూర్చుంటుంది. ఏయేమాటలు మాట్లాడితే పుస్తెగట్టానన్న ధీమాతో యేడుస్తున్న మగాడు ఆత్మహత్య చేసుకుచస్తాడో ఆ నూటేపోటేకుళ్లుమాటలన్నీ బాకుల్లా యెడాపెడా విసిరేస్తుంది. ఇక వంకెనున్న తువ్వాల నేనే స్వయంగా తీసుకోవాలిసివస్తుంది. కాగులో వేణ్ణీళ్ళు నేనే స్వయంగా బిందెలోకి తోడుకోవాలిసివస్తుంది.

"సుఖపడటం ఆమనిషికి చేతగాదు. ఇతరులను సుఖపెట్టడం ఆమనిషికల్ల నేమౌతుంది? అసలావిడకు సుఖమక్కర్లేదు. ఆ ఆడదానిలో సుఖంకావాలని వాంఛించటం అది అజ్ఞానం.

"సుఖాన్ని అనుభవించటంకాదు, ఆవిడకు కావలసింది. తను చాలా సుఖపడుతోందని చుట్టూవున్నవాళ్లంతా అనుకోవాలి. తను, కోకిలా, 'సుఖపడుతున్నా, సుఖపడుతున్నా' అంటూ వాక్కుంటూ వుండాలి; చుట్టూ వున్నవాళ్లంతా వాగాలి. ఈ 'దశ్శరథి'వీరంగం సాగుతూవుంటే, ఇదావిడకు చాలు.

"ఆత్మహత్యజేసుకుని, సుఖంకోసం టఫేటా బ్లౌజుల్లో, బర్మాశాండిల్సులోనూ, మెరీనాబీచ్‌లోనూ వెదుకులాడే ఆడదానికి జీవితంలో సుఖమెక్కడ లభిస్తుంది మేరి ?—అల్లాంటి ఆడదానిలో మొగవాడు సుఖంకోసం దేవుళ్లాడటం ఎంత అవివేకం!

"అబ్బా! ఆ నరకమంతా మళ్లా తల్చుకుంటూ వుంటే నా గుండెలు కర్పూరంలా గాలిలోకి హరించిపోతున్నయ్ మేరీ! ఆవిషయం నన్ను మరిచిపోనీ

మేరీ! కదిలించబోకు; ఆఘోష వదిలెయ్. పాతాళ కూపంలోకి దిగబడిపోతున్నాను. జీవచైతన్యంతో తొణికిసలాడుతున్న నీ అరచెయ్యి నాకు బరువుగా అందించి పైకి లేవదీసుకో మేరీ! మళ్లా జీవితంలోకి అందిపుచ్చుకో; ఇప్పుడు నాచెయ్యి జారవిడవాలని చూడకు—దిగబడిపోతున్నాను.

"అనవసరంగా కంగారుపడి... నాప్రక్కనుంచి అజ్ఞాతంలోకి ఎగిరిపోవాలని చూడకు...మళ్ళా ఒంటరిగా బ్రతకలేను...నేను ఏకాకిని."

## ౨

అసురసంధ్య—

దూదిపింజెల్లాంటి తెల్లటి మబ్బులు. ఎఱ్ఱటి సంధ్యారాగంలో పరుగులు తీస్తున్నయ్. ఆ వేపున నిప్పంటుకుని, ఆకాశం ఆ పెంకాపెంకా తగులడిపోతున్నట్టు కనుపించుతోంది. సూర్యబింబం ఆజ్వాలల్లో ఎఱ్ఱగా కాలి భస్మమైపోతూ, క్షణక్షణం భూగర్భంమీద హరించిహరించి పోతోంది. ఆ పొలంమీద వున్న మానూ మాకూ అన్నీ మంటలంటుకొని, భగభగా మండిపోతున్నట్టుగా కనుపించుతున్నయ్. ఏటిగాలికి ఆకులూ, రెమ్మలూ కదిలి తెపకలు తెపకలుగా మంటలలుముకుపోతున్నట్టు బీభత్సంగా వుంది.

జుట్టు చికాగ్గా రేగిపోయింది. చిన్నదొర ఆ మంచెముంగు వాల్చివున్న మడతమంచంమీద ఒక మూలగా గిజాటుగా కూర్చుని అదృశ్యంలోకి కోపంగా చూస్తున్నాడు. సంధ్యారాగం పడి, అతని ముఖం నెత్తురు పులుముకున్నట్టు ఎఱ్ఱగా భయంకరంగా వుంది. ఆ సూర్యుడికి మల్లేనే తనూ ఎవో మంటల్లో వొళ్లు కాలి తగలడిపోతున్నట్టు అలజడిగా వున్నాడు.

కట్టుగొయ్యల దగ్గిర కట్టేసున్న గొడ్లు కట్టుగొయ్యల దగ్గిరే ఒగాలుపడి నిల్చుని అతనివంక తెంగగా చూస్తున్నయ్. పరక కొరకడంలేదు. పొలాన్నుంచి వచ్చాక అతను వాటిని కంట జూడలేదు, పంట పలకరించలేదు. కనుమూరెద్దు మోర పైకెత్తి 'అంభా' అని జాలిగా పిలిచింది. అతను మాట్లాడలేదు. దాని రెండుకాటికకళ్లలోనుంచీ రెండు నీటిబొట్లు గాజుగోలీల్లా జారి భూమిమీద పడ్డయి. అతను కన్నెత్తి మాడన్నా చూళ్లేను. వెచ్చగా బుసగొట్టింది. నిల్చున్నయెద్దు నిల్చున్నపళాన నీరసంగా కించుకుపోయి నెమ్మదిగా కాళ్లుముడుచుకొని పడుకుంది. వట్టి నోరే దిగులుగా నెమరేస్తోంది.

మేకపిల్ల తల్లిపొదుగులోనుంచి నెమ్మదిగా లేచి వచ్చి భయంభయంగా దూరదూరాన నిల్చుని, మెల్లిగా 'మెహెహె!' అని అడిగింది.

'ఏమో!... నన్నడుగుతారేం...ఆ తాసిల్దారు చెల్లెల్నడగండి' అన్నట్టు, చిరాగ్గా కసిరికొట్టినట్టు ఒకమాపు చూశాడు. మళ్లా ఆకాశంవైపు ముఖం తిప్పేసుకున్నాడు.

మంటలన్నీ ఒకటొకటే ఆరిపోతున్నయ్. ఆకాశమంతా నల్లగా కమిరిపోయింది. చీకట్లు క్రమ్ముకుంటున్నయ్.

చేనుగట్టున వున్న చిట్టికేసరచెట్టునిండా గిజిగాడిగూళ్లు వ్రేళ్లాడుతున్నయ్. ప్రొద్దుగూకేటప్పటికి ఆ బంగారుపిచ్చుకలన్నీ కొమ్మల్నిండా జేరాయి. "కిజ్ కిజ్ కిజ్" మంటూ ఉద్రేకంతో వాటిలో అవి ఏదో గందరగోళంగా మాట్లాడుకుంటున్నయ్. 'కిజ్ కిజ్ కిజ్' ప్రతిపక్షీ తను చెప్పేది వినమనటంతప్ప అవతల పక్షి మాట్లాడే దేమిటో కాస్త విందామన్న జ్ఞానం అందులో యేపక్షికీ వున్నట్టు తోచదు. కిజ్ కిజ్ కిజ్-పిచ్చెత్తిపోయేలా ఒకటే రొద; చికాగ్గా కూసేస్తున్నయ్.

'కిజ్ కిజ్ కిజ్—పాపం! మరియమ్మ...యెంత మంచితల్లి; ఇట్టా బెడ్డేనా తుంచి అదిలించేది కాదు. ఇంతికీ దాని రాత—'

'కిజ్ కిజ్ కిజ్— సాహుకారుమరదలు...పిశాచి... ఎంతపని జేసిందీ... అక్కనాక్కరుగా నిండు ప్రాణాన్ని కూనీచేసింది...'

'కిజ్ కిజ్ కిజ్—మొన్న దీపావళినాడే; పండగ చేసుకున్నానని పిలిపించిందిట; పప్పన్నం పెడతానని పిలిపించి ప్రాణం తీసేసింది—అరిసెల్లో విషం పెట్టిందిట: ఎంత కసివారుంటారూ!'

'కిజ్ కిజ్ కిజ్!—పాపం! మరియమ్మంటే దానికంత కోప మెందుకో?'

'కిజ్ కిజ్ కిజ్!—ఆ సంగతి నీకు తెలియదా యేమిటే? మొగాణ్ణి సుఖపెట్టుకోటం దానికి చేత

గాదు. వాడూ అదీ ఎడముఖం, పెడముఖం; వాడు ఇల్లొదిలేసి, ఈ పదేళ్ళనుంచీ, చీకట్లోకూడా ఈపొలం లోనే తిరుగుతున్నాడు.'

'కిజ్ కిజ్ కిజ్ — చీకటంటే వాడికి భయం లేదా ?'అంది, ఒక పక్షికూన, గూట్లోనుంచి మెడ బయటికి చాచి. దానిమాట యెవళ్లూ వినిపించుకోలేదు.

'కిజ్ —మరియమ్మమొగుడు ?'

'కిజ్ —అవును, యేసోబ్.'

'కిజ్ కిజ్ —అది ఎంతయేడిచినా వినకుండా యుద్ధంలోకి పోయాడు'

'కిజ్ —అవును, చచ్చాడుగా!'

'కిజ్ కిజ్ కిజ్ —వాడు చావటంతో మరియమ్మ కూడా ఒంటరిపక్షై తిరగటం ప్రారంభించింది. ఈ యేకాకులిద్దరూ తాగసిల్దారు. ఇద్దరూ కలిసి హాయిగా బుడమేటిఒడ్డుకు వెన్నెట్లోకి నడిచిపోయారు. హాయిగా మళ్లా జీవితంలోకి బ్రతుకుతున్నారు!'

'కిజ్ కిజ్ —మొగుడక్కర్లేనిదానికి మరి, మరియమ్మమీద కోపం దేనికి ?'

'కిజ్ కిజ్ —అది మొగుడుకోసం కాదు; అది తాసిల్దారుచెల్లెలుట; తాసిల్దారుచెల్లెలి మొగుడు ఎవరినో కానిదాన్నుంచుకున్నాడంటే తనకూ, తనవాళ్లకూ తలవంపులుగా వుందిట.'

'కిజ్ కిజ్ —మొగుణ్ణి సుఖపెట్టలేని ముప్పె అని లోకులు చెప్పుకుంటుంటే, అది తనకూ, తన వాళ్లకూ తలవంపులుగా యేమీ లేదుగాబోలు ?'

'కిజ్ కిజ్ —ఖూనీచేసినందుకు ఆపాపిని ఉరి కంబ మెందు కెక్కించారుగాదూ ?'

'కిజ్ కిజ్ — తాసిల్దారుచెల్లెలూ, సాహుకారు మరదలూ ఖూనీచేస్తే మటుకు దాన్ని శిక్షించే వాడెవడు ? పాడుదేశం!—'

'కిజ్ కిజ్ —ఇంతకూ, యీయుద్ధం దానికొంప దీసింది !'

'కిజ్ కిజ్ — యేసోబ్ ఎల్లాగైనా వెంకె ముండావాడు లెద్దురూ! యుద్ధట, వాడి శ్రాద్ధం! తను చచ్చాడు, దాని ప్రాణం తీసేయించాడు.'

'కిజ్ కిజ్ కిజ్ —పాపం! వాడేంచేస్తాడు, పది డబ్బులు సంపాయించి తెచ్చి పెళ్ళానికి పెట్టుకోవాలనుకుని ఆశపడ్డాడు; చస్తాననుకున్నాడా ?'

'కిజ్ కిజ్ —మీకు తెలవదు లెద్దురూ...అసలిదంతా ఆ అసమర్థపు చిన్నదొరమూలంగా వచ్చింది. ఆతల్లిని కాపాడుకోలేక, ఆపెద్దపులినోటికి బలిగా అందించాడు—అసమర్థుడు'

'కిజ్ కిజ్ —సన్నాసి,—చవట—'

'కిజ్ కిజ్ —చచ్చువెధవ'

'కిజ్ కిజ్ —అడుగడుగో! అరే! ఇక్కడే కూర్చున్నాడు; మనం చూణ్ణేలేదు. వీడి గతి ఎపుడూ ఇంతే, ఏకాకి.'

'కిజ్ కిజ్ —ఏడేడీ ?—'

'కిజ్ —అదుగో, మంచంమీదా !'

'కిజ్ కిజ్ కిజ్ —ఏడేడీ ?' అంటూ పక్షులన్నీ కిలకిలా కొమ్మలచివరలకు వచ్చేసినై.

'కిజ్ కిజ్ కిజ్ —వాడే, వాడే, వాడే'అంటూ పిచ్చెత్తిపోయేలా గజిబిజిగా కూసేస్తున్నయ్.

చెదరిపోయిన జుట్టులోకి వేళ్లు పోనిచ్చి, చికాగ్గా పీక్కుంటూ, పిచ్చివాడులా లేచి, ప్రాణం లేని చీకటిక్రీనీడలా నిస్పృహగా, బుడమేటొడ్డుకు అంధకారంలోకి నడిచిపోతున్నాడు.

## 3

కారుమబ్బుల కాళరాత్రి—

కన్నూ కన్నూ పొడుచుకున్నా కనుపించకుండా అంధతమసం! జీమూతాలు ఆకాశంలో పరుగులు తోలుతున్నయ్.

ఆ నిశాగర్భంలో రెండుగట్లకూ తనాయించి, ప్రపంచాన్నంతా ముంచిపారేసే ఉద్వేగంతో కెరటాలెగరవేసుకుంటూ, అల్లకల్లోలంగా, కొల్లుదుబ్బుల మీదుగా పొర్లిపోతోంది బుడమేరు.

గట్టుమీద నుంచుని నదీగర్భంలోకి చూస్తున్నాడు ఆశక్తి. అతని హృదయంకూడా స్వాధీనం తప్పి, కెరటాలు లేగి కల్లోలమైపోతోంది. ఆ జలవేగాన్ని అనుసరిస్తూ రివ్వున...యెక్కడికో—

సన్నగా తుపరపడుతోంది. ఆ ఈదురుగాలికి చెట్లు జడలదెయ్యాలులా అంధకారంలో భయంకరంగా ఊగిపోతున్నయ్.

ఆకాశం ఒక్కసారి విరిగిపడిపోతున్నట్టు ఫెళ ఫెళా ఒక్క ఉరుమురిమింది; 'జిగేల్'మని ఒక మెరుపుతీగ 'సర్ర్'న భయంకరంగా అంధకార గర్భాన్ని చీరిపారేసి మళ్ళా అదృశ్యమైపోయింది.

'ఇన్ఛ, ఇన్ఛ, ఇన్ఛ, ఇన్ఛ'— దూరాన చీకట్లో, గులకరాళ్ల మీద మట్టెలు మ్రోగుతున్నయ్.

గట్టుమీద నిల్చున్న రుద్రమూర్తి చివాల్న వెనుదిరిగి, సింహంలా ఉరిమి చూశాడు.

పసిడిగాజులు జిలుగ్గా మ్రోగినై — 'హు' అని భయంకరంగా గర్జించాడు. వాయుగర్భం కంపిల్లి పోయింది.

ఎర్రగా మినుకుమినుకుమంటున్న లాంతరు వెలుగులో, మామిడిపిందెల పట్టాలతో, చిక్కిపోయినట్టు సన్నగిలి, సాజుగ్గా వున్న, చిన్నిచిన్ని ఆడపాదాలు గట్టెక్కుతున్నై.

"ఎందుకొచ్చావ్ ?—" అంధకారగర్భంలోకి భయదంగా గర్జించాడు.

"..........."

"మాట్లాడవేం ?—"

సన్నగా ఆడగొంతుయేడుపు వినిపించింది.

"నాకొక్కడా అరిసెలు తెచ్చావా ?...తెస్తే యిలా తే"—

విలయంగా ఘూర్ణిల్లిపోతున్న ఆనదిలోకి ఆ క్రోధమూర్తి పెద్దపెద్ద అంగలు వేసుకుంటూ నడిచి పోతున్నాడు.

"అమ్మో ! అమ్మో ! ఆగండాగండి ! ... అదేమిటి ?"

"నదిలోకి అడుగుపెడితే చస్తావ్"... జలగర్భ ప్రళయంగా ఘూర్ణిల్లిపోయింది. నదిలో ఫర్లాంగు దూరాన, రెండు ఏనుగుతుండాలు నీటికెరటాలమీద దబాదబా బాదుతున్నట్టు శబ్దం వినిపిస్తోంది.

తనూ అతణ్ణి వెంబడిస్తుంది; చచ్చినాసరే— నీరు గుండెల్దాకా వచ్చి పడిపోసేస్తోంది;

'అమ్మో!—' భయమేసి, అడుగు వెనక్కి తీసుకుంది.

"పోనీ, నీటిలో బడి మునిగిపోతుంటేనన్నా వచ్చి కాపాడుకోడూ ?...ఏమో..."అనుమానమేసింది.

'చస్తే చచ్చాను'—తూగి అడుగు ముందుకు వెయ్యబోయింది.

ఒక కెరటం 'రయ్యి'మని లేచి, పరుగెత్తుకుంటూవచ్చి, 'ఏడిశావ్! మొగవాడికోసం ప్రాణత్యాగం చేసే ధైర్యం నీకెక్కడేడిసింది? ఇదేం మరి యమ్మకు ఏమంటెట్టడమనుకున్నావా?'అని, ఫెళ్లున చెంపమీద కొట్టి, నెత్తిమీదుగా పార్లిపోయింది.

పుక్కిలింతలై, హడిలిపోయి, ప్రాణభీతితో, వెనక్కి గట్టుమీదకి పారిపోతోంది ఆస్త్రీ.

నదిలోనుంచి బయటికి లేచి అవతలిగట్టుమీది కెక్కుతున్నాడు ఆ రుద్రమూర్తి. ఇవతలిగట్టుమీద గజగజా వణుకుతూ నిల్చున్న ఆస్త్రీవంక భయంకరంగా ఉరిమిచూచాడు.

"పో ! ఇంటికి పో ! హాయిగా బ్రతుకు, నీకు కావలసింది డబ్బూ, గౌరవం—కావలసినంత నీ మొహాన పారేశాను. నెత్తినేసి కొట్టుకో— మొగాడి జోలి నీకెందుకు ?— మేరీని చంపేశానని మటుకు చంకలు గొట్టకోకు. ఇదుగో మేరీ నా హృదయంలో. కళ్లు తెరుచుకు చూడు"—నదీగర్భంమీదుగా ఆకాశంలో వినుపించుకోంది.

ఫెళఫెళా ఒక ఉరుమురిమింది. ఒక మెరుపు మెరిసింది—మేరీని హృదయంలో దాచేసుకుంటున్నట్టు రెండు ముంజేతులూ ఎదురొమ్ముమీద ముడిచేసుకుంటూ పెద్దపెద్ద అంగలుగా ఆకాశపుటంచు దగ్గిరికి కోపంగా నడిచి పోతున్నాడు.

